సమస్యలతో విద్యార్థులు సతమతం


అసంపూర్తిగా నిలిచిపోయిన టాయిలెట్స్


పాడైపోయిన సిమెంటు బస్తాలు

- నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం
- చెన్నకేశవ కాలనీ పాఠశాల దుస్థితి

కారెంపూడి: స్థానిక చెన్నకేశవ కాలనీ(సుద్దగుంతలు) ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ మధ్యలో పాఠశాల ఉండడంతో బయటకు వెళ్లడానికి కూడా అవకాశం లేదు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. నాడు– నేడు ఫేజ్– 2లో పాఠశాల ఆధునికీకరణ పనులు 2022లో ప్రారంభించారు. పనుల్లో భాగంగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిర్మాణ పనులు జరుగుతుండగా ఎన్నికలు రావడం ఆ తర్వాత నిధులు కూడా మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు ప్రస్తుత ఎంఈఓ రవికుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే టాయిలెట్స్ లేక విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల హెచ్ఎం బిట్రా సురేష్ వాపోయారు. పాత టాయిలెట్స్ పడేసి ఆ స్థానంలో కొత్తవి కట్టుబడి ప్రారంభించి బేస్ మెంట్ పిల్లర్స్ వేశారన్నారు. అప్పట్లో ఎస్ఎంసీ, హెచ్ఎం సంయుక్తంగా పనులు చేపట్టారని అయితే ఏ కారణం చేతనో నిర్మాణం నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే దాని కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన ఇనుము రక్షణ లేకుండా పడిఉంది, అది వర్షానికి తడిసి తుప్పు పట్టి పాడైపోతోంది. అలాగే 15 సిమెంటు కట్టలు దాకా వర్షానికి తడిసి పాడైపోయాయి.


తుప్పు పట్టిపోతున్న ఇనుము


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా.. డ్వాక్రా ఆఫీస్

అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా..

దానికి తోడు పాఠశాలకు ఆనుకుని అసంపూర్తిగా నిలిచిపోయిన డ్వాక్రా బిల్డింగ్ ఒకటి దశాబ్ద కాలంగా అసౌకర్యంగా మారింది. స్లాబు వేసి తలుపులు కిటికీలు ఫ్లోరింగ్ వేయకుండా వదలి వేయడంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. 2017లో డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే కాంట్రాక్టర్ బిల్డింగ్‌పై కప్పు వేసి ఫ్లోరింగ్ తలుపులు కిటికీలు కరెంటు ఇతర పనులను చేయకుండా వదిలేశారు. అప్పటి నుంచి ఈ బిల్డింగ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం కూడా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 'నిరసన వారం'


మాట్లాడుతున్న రవికుమార్

వెల్దుర్తి: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ నిరసన వారం నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ మాచర్ల జోన్ ప్రధాన కార్యదర్శి వీవీ రవికుమార్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు నిరసన వారం కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. స్థానికంగా సంఘ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15నెలలు అవుతున్నా బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తూ గత ప్రభుత్వం బాటలోనే నడుస్తోందని విమర్శించారు. సీఎం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం మాదంటూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పటం లేదన్నారు. మాది మంచి ప్రభుత్వమని చెబుతూ 12వ పీఆర్సీ అని చెప్పి, ఐఆర్‌ను ఎందుకు ప్రకటించలేదన్నారు. సీపీఎస్ రద్దు విషయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీపీఎస్‌పై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పి ఇప్పుడెందుకు మాట్లాడటం లేదన్నారు. సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించకపోవటం ఉపాధ్యాయులలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రామానాయక్, సాని శ్రీనివాసరావు, బి.ఆనంద్, కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు డి.ఆంజనేయులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



రెంటచింతల: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాలు.. రెంటచింతల రేంజ్ బజారు నివాసి, అధ్యాపకుడు జనార్ధనరావు గత నెల 2న భార్య సుమతిగ్రేస్‌తో కలిసి మాచర్ల వెళ్లారు. రెండు రోజుల తర్వాత ఇంటికి రాగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. 123 గ్రాము బంగారం ఆభరణాలు, రూ.20 వేలు అపహరణకు గురైనట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు విచారించిన క్లూస్ టీంకు జెట్టిపాలేనికి చెందిన తమ్మిశెట్టి సాయి కుమార్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి గురజాల కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సాయి నుంచి 29.8 గ్రాముల నగలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యార్థులతో స్నేహంగా ఉంటాం


పోలీస్‌లుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

- పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగిస్తాం
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు
- పోలీస్‌లుగా ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు అభినందన

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగేలా త్వరలో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ 15 మంది ఇటీవల నిర్వహించిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ఎంపిక కావటాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాల ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను అర్ధాంతరంగా చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ఎస్పీ కార్యాలయంలో ఒకరోజు పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు శారీరక, మానసిక శిక్షణ, పోలీస్ విధులు, ఆయుధాలు ఉపయోగించే విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలియచేయనున్నట్లు ప్రకటించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్, ప్రతి విద్యార్థి తమ తమ గ్రామ పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందితో పాటు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్, అగ్నివీర్ జవాన్‌ను అభినందించారు. మరో అతిథి 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ హవల్దార్ షంషేర్ సింగ్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ క్యాడెట్స్ కృషిని అభినందిస్తూ ఇతర విద్యార్థులకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను మరింత మెరుగుపరిచామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.రామకృష్ణరాజు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇమ్మానుయేలు ప్రార్థన మందిర వార్షికోత్సవం



మాచర్ల: దైవ సేవకుడు పరిచర్యలో దైవిక విధానాల ఫలం కోసం ఎదురు చూడాలని అప్పుడే శ్రేష్టమైన దీవెనలు పొందగలరని రెవరెండ్ పాల్ డేవిడ్ అన్నారు. పట్టణంలోని సుద్దగుంతల కాలనీలో ఏజీ ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాస్టర్స్ సమావేశంలో అంతర్జాతీయ సువార్తికుడు రెవరెండ్ పాల్ డేవిడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక సంఘ పాస్టర్ ఎస్.ఆర్.ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి పల్నాడు దైవ సేవకుల సంఘం కార్యదర్శి మోహన్ అధ్యక్షత వహించారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు కడియం రోహిత్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం తీసుకోవాలని కోరారు. మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి ప్రత్యేక కమిటీ వేయాలని కోరారు.

రొంపిచర్లలో ఆరంభమైన పశువుల సంత


పశువుల సంత ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ మొండితోక రాణి

రొంపిచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాంతపు పశువులు, గొర్రెల సంతను రైతులు సద్వినియోగం చేసుకోవాల ని మార్కెట్ యార్డ్ చైర్మన్ మొండితోక రాణి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పశువుల సంతను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రొంపిచర్ల మండలం లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. రైతులు తమ పాడి పశువులు అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా దూర ప్రాంతాలకు రవాణా ఖర్చులు భరించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రవాణా ఖర్చులు అవసరం లేకుండా రైతులకు మార్కెట్ సౌలభ్యం చేరువ చేయాలనే సంకల్పంతోనే పశువుల సంత ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బుధవారం పశువుల సంత, గురువారం గొర్రెల సంత జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, నాయకులు కొల్లి బ్రహ్మయ్య, ఇమ్మడిశెట్టి కాశయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మొండితోక రామారావు, వడ్లమూడి వెంకట కిషోర్, పచ్చవ కోటేశ్వరరావు, వాసిరెడ్డి రవి, పాల్గొన్నారు.

డ్రోన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం

నరసరావుపేట రూరల్: వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా డ్రోన్ సర్వీస్ సెంటర్ పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. సత్తెనపల్లిరోడ్డులో ఇలా అగ్రి సర్వీస్, దక్ష అథరైజ్ డ్రోన్ సర్వీస్‌ను బుధవారం జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్‌ను వినియోగిస్తున్న రైతులు, వర్ధమాన డ్రోన్ ఆపరేటలర్స్ డ్రోన్ రిపేర్స్, స్పేర్స్ కోసం సదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీని వలన సమయం, ధనం వృధా అవుతుందని తెలిపారు. నాణ్యమైన డ్రోన్ రిపేరు, నమ్మకమైన స్పేర్స్ ఈ సెంటర్‌లో పొందగల్గుతారని పేర్కొన్నారు. ఇలా అగ్రి సర్వీసెస్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శివనాగశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల డ్రోన్‌ల మరమ్మత్తులు కేవలం 12 గంటల వ్యవధిలో చేయబడుతుందని తెలిపారు. దీంతో పాటు స్లాట్‌లు బుక్ చేసుకుంటే తమ సర్వీస్ సెంటర్ ద్వారా డ్రోన్‌ల వినియోగించి పురుగు మందు పిచికారీ చేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దక్ష డ్రోన్ డీజీఎం గోపాలకృష్ణన్, ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు తెలిపారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

డీఎస్పీ జగదీష్



గురజాల: ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ బి.జగదీష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, మోటారు వాహనాలు, బ్యాంకు కేసులు వంటివి ఏమైనా కేసులు ఉంటే వెంటనే అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని సూచించారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్ఐలు వై.వినోద్ కుమార్, బి.అనంత కృష్ణ ఉన్నారు.

స్వామి వివేకానంద బాల వికాస్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

మాచర్ల: విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలు అందించడం శుభ పరిణామమని మాచర్ల మండల విద్యా శాఖ అధికారి అల్లి సురేష్ అన్నారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో బుధవారం మాచర్ల శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో స్వామి వివేకానంద బాలవికాస్ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్, మాజీ డెప్యూటీ డీఈఓ గాదే రామకృష్ణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ చైర్మన్ ఆదేశాల మేరకు పట్టణంలో అన్ని వార్డుల్లో కాలువల్లో పేరుకు పోయిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు బుధవారం తొలిగించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మునిసిపల్ కమిషనర్ డి.వేణు బాబు 50 రోజుల్లో 17 మంది అదనపు సిబ్బందిని సహకారంతో మురుగు కాలువల్లో పూడిక తీత, పారిశుద్ధ్యం చర్యలు చేపట్టారు. దోమల వ్యాప్తిని కట్టడి చేసేలా తగు చర్యలు తీసుకున్నారు. ఇళ్ల ముందు చెత్త నిల్వలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి తొట్టిల్లో, పాత టైర్లు, గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

నర్సిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే పీఆర్కే పరామర్శ



వెల్దుర్తి: అనారోగ్యంతో మాచర్లలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన వజ్రాల యల్లారెడ్డి కుమారుడు నర్సిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు పోతురెడ్డి కోటిరెడ్డి, జలీల్ ఉన్నారు.

పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ ఏఈగా పోతురాజు



పిడుగురాళ్ల: విద్యుత్ పట్టణ ఏఈగా పోతురాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోతురాజు చేబ్రోలులో జేఈగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించటం జరుగుతుందని తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ డే



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ మోడల్ స్కూల్‌లో బుధవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్ డే పురస్కరించుకొని మొక్కలు నాటారు. దేశంలో ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ నాయకుల సేవకు చిహ్నంగా మొక్కలు నాటుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి నాయక్ తెలిపారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్ సెంటర్ 1956 సెప్టెంబర్ 10వ తేదీన ప్రారంభించారన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు, డొక్కా సీతమ్మ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్‌లు పాల్గొన్నాయి.

చదువే ఎదుగుదలకు తోడ్పాటు..


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన యేసయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి: నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను పట్టుదలతో చదువుకోవటం వల్లే ఈ స్థాయికి చేరుకున్నట్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగెండ్ల యేసయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి ఎస్టీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న యేసయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు యేసయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యేసయ్య మాట్లాడుతూ... జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును పొందటం ద్వారా విధి నిర్వహణలో తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. తన పెద్ద కుమారుడు రత్న కిషోర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఇటీవల ఉద్యోగం సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు, నాయకులు తగరం ఆనంద్ కుమార్, రాజా, ఉపాధ్యాయులు అనూరాధ పాల్గొన్నారు.

మిరియాలలో యూరియా పంపిణీ


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న డీడీఏ శ్రీకృష్ణదేవరాయలు

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో రైతులకు యూరియాను బుధవారం పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ డీడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ యూరియా, నానో యూరియాను రైతులు తగిన మోతాదులో సమర్థంగా వాడాలని సూచించారు. యూరియాను రైతులందరికి అందే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. గ్రామ రైతులకు వేసిన పంట విస్తీర్ణం ప్రకారం అవసరమైన యూరియాను అధికారులు పంపిణీ చేశారు. యూరియా కంటే నానో యూరియా స్ప్రే చేయడం వల్ల అధిక ఫలితాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి పి నరసింహారావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ వీరయోధురాలు ఐలమ్మకు ఘన నివాళి


పిడుగురాళ్లలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: వీరతెలంగాణ యోధురాలు ఐలమ్మ వర్ధంతి పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన పిల్లుట్ల రోడ్డులోని ఐలమ్మ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి శెట్టుపల్లి పూర్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. దొరలకు నిజాం రజకారులకు వ్యతిరేకంగా భూమి కోసం, వెట్టిచాకరి విముక్తి కోసం, భూమి పోరాటాలు చేసి లక్షలాది పేద ప్రజలకు భూమిని పంపిణీ చేశారని, బడుగు, బలహీన వర్గాలకు ఆమె స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీసీ నాయకులు నల్లమోతు రాజు, అంబేడ్కర్ ప్రచార సేవా సమితి అధ్యక్షులు డేగల అబ్రహాం, వెలిశల రామకృష్ణ, రజక సంఘ నాయకులు కంభంపాటి పెద్ద వెంకటేశ్వర్లు, మైలవరపు అశోక్, రాంపాటి కొండలు, నెకరికంటి కృష్ణ, పాట్లూరి శివ, శ్రీను, కమ్మంపాటి చిన్న వెంకటేశ్వర్లు, రావులపల్లి చిరంజీవి, నడికోట వేణు, గోపి పాల్గొన్నారు.


మాచర్లలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు

మాచర్ల పార్క్ సెంటర్‌లో..

మాచర్ల: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ అని పలువురు కొనియాడారు. పట్టణంలోని పార్క్ సెంటర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతిని సందర్భంగా బుధవారం ఆమె విగ్రహం వద్ద ఐలమ్మ విగ్రహ కమిటీ సభ్యులు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా షేక్ అబ్దుల్ జలీల్ పాల్గొన్నారు. మన్యం పాండురంగారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా పేరును ఎంతో గొప్ప సేవలు అందించిన మహాకవి గుర్రం జాషువా పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల జాన్, పాపిరెడ్డి(రిటైర్డ్ హెడ్ మాస్టర్), అంజిబాబు, షేక్ పాషా వలి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి


దరఖాస్తు ఫాం విడుదల చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పేద ఆర్యవైశ్య విద్యార్థుల చదువుకు సహాయపడేలా మండవ సీతారామాంజనేయులు జయశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సీతారామాంజనేయులు బుధవారం తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్ దరఖాస్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 101 మంది ప్రతిభ గల పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున అక్టోబర్ 11వ తేదీన శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అందచేస్తామని వివరించారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను పూర్తిచేసి అందివ్వాలని తెలిపారు. వివరాలకు 9490087779, 9246453348 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, మండవ పూర్ణచంద్రరావు, పెనుగొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

మోస పోయామంటూ మహిళల ఫిర్యాదు



నూజెండ్ల: డ్వాక్రా మహిళల పొదుపు డబ్బులు కట్టకుండా కాలనీకి చెందిన మహిళ మోసం చేసిందని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో వి.అప్పాపురం యస్సీ కాలనీ మహిళలు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన సమా చారం ప్రకారం కాలనీకి చెందిన మహిళ గతంలో డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేసేది. ఆ తర్వాత వేరే ఉద్యోగం రావటంతో అందులోకి చేరింది. స్థానికురాలు కావటం, ఆమెపై నమ్మ కం ఉండటం, గ్రూపు సభ్యులు నిరక్షరాస్యులు కావటంతో పొదుపు డబ్బులు బ్యాంకులో కట్టమని ఆమెకే ఇచ్చేవారు. లోను చెల్లించటం లేదని ఇటీవల బ్యాంకు నుంచి నోటీసు రావటంతో విషయం బయట పడింది. షుమారు సంవత్సర కాలం నుంచి బ్యాంకులో డబ్బులు జమ చేయటం లేదని తేలిందని మహిళలు వాపోయారు. మొత్తం 4 గ్రూపుల సొమ్ము 20 లక్షల వరకూ స్వాహా చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమని అడిగితే తిరిగి మాపైనే పోలీస్ కేసు పెట్టిందని కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పాలపర్తి అయ్యమ్మ, తూమాటి రమణ, దేవేంద్ర, గరిగల అంజమ్మ, కొత్త అంకమ్మ, సువార్త తదితరులు ఉన్నారు.